అక్షరశక్తి
The Power of Pen
Evening Daily
సంపుటి: 20 | సంచిక: 304 | వరంగల్ | మంగళవారం, 08 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06



# కడియంకు సిగ్గుండాలె!

## కేసీఆర్ వల్లే గల్లీ నుంచి ఢిల్లీకి పోయినవ్!






- దళితులపై కేసీఆర్‌కు ప్రేమ లేదనడం సిగ్గుచేటు
- నిజంగా నువ్వు దళిత పక్షపాతివైతే స్పీకర్ పోడియం ముందు కూర్చో
- కేసీఆర్ అండతోనే డిప్యూటీ సీఎం.. ఇప్పుడు ఆయనపైనే విమర్శలా?
- దళిత బంధు ఇచ్చింది బీఆర్ఎస్.. కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?
- కడియం శ్రీహరిపై దాస్యం వినయ్‌భాస్కర్ ఫైర్

5

దళితులకు కేసీఆర్ ఏమీ చేయలేదంటూ అసెంబ్లీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయంగా కడియం శ్రీహరి ఎదుగుదలకు కేసీఆర్ చేసిన సహకారాన్ని మరిచిపోయి ఇప్పుడు ఆయనపైనే విమర్శలు చేయడం కృతజ్ఞతా రాహిత్యమని ధ్వజమెత్తారు. రాజకీయంగా పక్కకు వెళ్లిపోయి మూలన కూర్చున్న కడియం శ్రీహరిని గల్లీ నుంచి ఢిల్లీకి తీసుకెళ్లింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. దళిత నాయకుడైన కడియంను ఉప ముఖ్యమంత్రిని చేసి రాజకీయంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది కూడా కేసీఆర్ కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కేసులు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ మంగళవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినయ్‌భాస్కర్ వినతిపత్రం సమర్పించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా రాస్తారోకో నిర్వహించి, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు. - అక్షరశక్తి, హన్మకొండ

## రామప్ప పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం

శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల సమగ్ర పరిశీలన

జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు

యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు. - అక్షరశక్తి,ములుగు



2



ఫైల్ ఫోటో

## ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు లేని మహా ధర్నాకు మద్దతు లేదు

రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థలు, సొసైటీల్లో పనిచేస్తున్న సుమారు 5 లక్షల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఎజెండాలో చేర్చకుండా సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్–మహా ధర్నా'కు తమ మద్దతు లేదని తెలంగాణ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. - అక్షరశక్తి,హైదరాబాద్

2



## నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**అక్షరశక్తి,హనుమకొండ:** నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో నిర్మిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఎన్ని రోజుల్లోగా పూర్తి చేయగలరనే విషయంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ లైన్ల పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తిచేయాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన ఈ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో ఉపయోగిస్తున్న నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఈఈ బి. గాయత్రీ, గ్రిడ్ ఈఈ రామాంజనేయులు, డీఈలు శ్రీనివాస్, జట్టి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమనవాణి, ఏఈలు అనిల్, నీరజ, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కామర్స్ విభాగాధిపతిగా మాదాసి కనకయ్య బాధ్యతల స్వీకరణ

**అక్షరశక్తి,హనుమకొండ:** యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ విభాగాధిపతిగా డాక్టర్ మాదాసి కనకయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి ఉత్తర్వుల మేరకు ఆయన మంగళవారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బిక్షపతి ఆధ్వర్యంలో అధ్యాపకులు డాక్టర్ మాదాసి కనకయ్యను పుష్పగుచ్ఛాలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ స్వామి, డాక్టర్ ఈ. రాజు, డాక్టర్ భక్కి శ్రీనివాస్, డాక్టర్ సురేష్, డాక్టర్ రమేష్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సరిత, డాక్టర్ తిరునగరి శేషు, డాక్టర్ పుల్ల రమేష్, డాక్టర్ ఫిరోజ్ పాషా షేక్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ హరికుమార్, డాక్టర్ శారద, డాక్టర్ శివకుమారి, డాక్టర్ చందర్, డాక్టర్ సదానందం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు కూడా పాల్గొని నూతన విభాగాధిపతికి శుభాకాంక్షలు తెలిపారు.



4

# రామప్ప పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం

- **శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల సమగ్ర పరిశీలన**
- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**అక్షరశక్తి,ములుగు:** యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ మండల పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు. ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ, పర్యావరణం, శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణతోపాటు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాల పై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యల పై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎం జి. దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం పి. సైదులు, ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్. సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి. గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్ ఎం.ఎస్., వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు జె. శ్రీధర్‌రావు, ఆచార్య ఎం.పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సీహెచ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి కె. వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి రజని, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ, ఇర్రిగేషన్ ఈ ఈ నారాయణ, వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు, ఎం పి డి ఓ రాజు, సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు లేని మహా ధర్నాకు మద్దతు లేదు


ఫైల్ ఫోటో

**అక్షరశక్తి,హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థలు, సొసైటీల్లో పనిచేస్తున్న సుమారు 5 లక్షల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఎజెండాలో చేర్చకుండా సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్-మహా ధర్నా'కు తమ మద్దతు లేదని తెలంగాణ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, వేతనాల జాప్యం, ఏజెన్సీల పెత్తనం, సామాజిక భద్రత వంటి సమస్యలను విస్మరించిన కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొనబోరని స్పష్టం చేసింది. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని, ఐఎఫ్‌ఎంఐఎస్/ట్రెజరీ ద్వారా జీతాలు అందించాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణలు, వార్షిక ఇంక్రిమెంట్లు అమలు చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. పీఎఫ్, ఈఎస్ఐ, మహిళా ఉద్యోగులకు చెల్లింపుతో కూడిన ప్రసూతి సెలవులు, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారం, దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి సేవా విరమణ ప్రయోజనాలు కల్పించడంతో పాటు తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరింది. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి మరింత బలంగా తీసుకెళ్లేందుకు అక్టోబర్‌లో హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం వేదికగా సుమారు లక్ష మంది ఉద్యోగులతో 'ఔట్సోర్సింగ్ ఉద్యోగుల గర్జన' నిర్వహించనున్నట్లు జేఏసీ తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 5 లక్షల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆకాంక్షలు, సమస్యలు, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేస్తామని పేర్కొంది. సెప్టెంబర్ 10న జరిగే 'చలో హైదరాబాద్-మహా ధర్నా'కు ఉద్యోగులు దూరంగా ఉండాలని, అక్టోబర్‌లో జరిగే 'ఔట్సోర్సింగ్ ఉద్యోగుల గర్జన'కు ఐక్యంగా తరలిరావాలని తెలంగాణ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం




**అక్షరశక్తి,నర్సంపేట:** వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కొత్తూరు గ్రామ సర్పంచ్ స్వప్న సంతోష్ కందికట్ల గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి వినాయక ప్రతిమల వినియోగంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు నీటి వనరులను పరిరక్షించవచ్చని తెలిపారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన ప్రతిమల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల పర్యావరణానికి అనుకూలమైన మట్టి ప్రతిమలను మాత్రమే వినియోగించాలని సూచించారు. "మట్టి వినాయకుడే ఆదర్శం.. కాలుష్యం లేని పండుగే మన లక్ష్యం" అని పేర్కొంటూ, భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని గ్రామ ప్రజలను కోరారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎండి ఆస్మా, వార్డు సభ్యులు తాటికాల నాగరాణి భాస్కర్, మాంకాళి రామాఎల్లయ్య, భీమన అపర్ణ కృష్ణ, నేలవెల్లి సుబ్బారావు, కారోబార్ కందికట్ల సురేష్, గల్లి గణేష్ యూత్ సభ్యులు, రామాలయం యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగమే పర్యాటకం







**అక్షరశక్తి,హనుమకొండ:** పర్యాటక రంగంలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలు ఎంతో కీలకమని చైతన్య డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ పర్యాటక విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి. విజయ్ అన్నారు. ప్రభుత్వ పింగళి మహిళా కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన వనరుల వ్యక్తిగా హాజరై 'సుస్థిర పర్యాటకం, భద్రత మరియు ఆచరణాత్మక శిక్షణ' అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. పర్యాటకులు వివిధ ప్రాంతాలను సందర్శించినప్పుడు కేవలం పర్యాటక ప్రదేశాలను చూడటంతోనే పరిమితం కాకుండా, ఆయా ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించాలని డాక్టర్ విజయ్ సూచించారు. స్థానిక ప్రజలతో మమేకమై, వారి జీవన విధానాన్ని అర్థం చేసుకోవడంతో పాటు స్థానికంగా నిర్వహించే పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా పర్యాటక అనుభవం మరింత మెరుగుపడుతుందని వివరించారు. వారసత్వ పర్యాటకం ద్వారా చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే సాంస్కృతిక పర్యాటకం ద్వారా వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

పర్యాటకుల రాకతో స్థానిక ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి దోహదం కలుగుతుందని, స్థానిక ప్రజలకు ఉపాధి, ఆదాయ మార్గాలు పెరుగుతాయని చెప్పారు. పర్యాటక రంగాన్ని సుస్థిరంగా అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక సమాజాల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చని వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపల్ సుహాసిని, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ పి. నరేష్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు



**అక్షరశక్తి, హనుమకొండ:** తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో మంగళవారం విష్ణుపురిలోని అంబేడ్కర్ కమిటీ హాల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సమితి ఆధ్వర్యంలో దళిత రత్న డా. హను కాంత్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా డా. హను కాంత్ మాట్లాడుతూ.. శాసనసభలో అత్యున్నత స్థానంలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని, సభా మర్యాదలు, విలువలను విస్మరించి ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వకపోతే సమాజంలోని ఎస్సీ, అట్టడుగు వర్గాలకు స్వేచ్ఛ, సమానత్వం ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు రాజ్యాంగ విలువలను, సభా సంప్రదాయాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్సీఆర్‌డీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దళిత రత్న కాదసి సులోచన, హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షురాలు బొల్లెపూగు ఇందిరా, దాసరి అనిత, గిన్నారపు మంజు, అజాజ్, సురేష్, శంకర్, రామ ప్రేమలత, భార్గవ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 18న మహా ధర్నాను విజయవంతం చేయండి



**అక్షరశక్తి, కొత్తగూడ:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లో ఆదివాసీ ఆత్మ గోషా కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 18 న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో ఆదివాసీ ఆత్మ గోషా మహా ధర్నా కార్యక్రమం షెడ్యూల్ తెగల జాబితా నుండి (ST ల నుండి) లంబాడి లను తొలిగించుటకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కమిషన్ నియమించాలని ఇంద్ర పార్క్ వద్ద జరుగు మహ ధర్నా ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, ఆధార్ సోసైటీ, AEWCA సంఘాలు పిలుపునిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగానికి విరుద్ధంగా లంబాడీలను ST జాబితాలో చేర్చడంతో రాజస్థాన్ లో OC, మహారాష్ట్రలో ఉన్న బీసీలు, కర్ణాటకలో ఉన్న ఎస్సీలు విపరీతంగా తెలంగాణ ప్రాంతానికి వలస వచ్చి ఆదివాసులకు అందవలసిన విద్య ఉద్యోగ రాజకీయ పరమైన రిజర్వేషన్ కొల్లగొడుతున్నారని వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించుటకు కమిషన్ నియమించేంతవరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించి పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర నడి బొడ్డులో ఇంద్ర పార్క్ వద్ద జరిగే ఆదివాసీల ఆత్మ గోషా మహా ధర్నాకు ఆదివాసీ ప్రజలు,విద్యార్థులు, ఉద్యోగులు మహిళలు ప్రజా స్వామిక వదులు వేలాదిగా కదిలీరవాలని పిలుపునిస్తున్నాం. ఈ కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, రమణాల లక్ష్మయ్య తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్క యాదగిరి, వట్టం కన్నయ్య, పూనేం సందీప్ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కొత్తగూడ, మల్లెల సారయ్య కొత్తగూడ మండల ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ మండల కమిటీ సభ్యులు ఈసం వెంకన్న, బీజ్జ సందీప్,బుర్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరశక్తి, గూడూరు :** ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ సంఘంలో జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమము సెప్టెంబర్ 10 నాడు నిర్వహించడానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమము మంగళవారం రోజు గూడూరు మండలం ఎమ్మార్వో ఆఫీస్ నందు చేయడం జరిగింది సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని పెండింగ్లో ఉన్న ఆరు డీఏలను మంజూరు చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లతో జేఏసీ ఉద్యమానికి నాంది పలికింది పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా తాసిల్దారు నాగ భవాని మాట్లాడుతూ ప్రభుత్వ బాధ్యతగా చెల్లించే వాటికి కూడా రోడ్లపై ఎక్కి ఉద్యోగుల ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగ భవాని జేఏసీ నాయకులు రవిచంద్ర మండల వెంకన్న గజ్జి మల్లేషు ఆదినారాయణ దబ్బకట్ల రమేష్ ఆంగోతు ధర్మ గుంటి శ్రీనివాస్ హరి శంకర్ సునీత నీలం రమేష్ మనోహర్ కన్న వెంకటేశ్వర్లు రఘుపతి రాజశేఖర్ విజయ జయ శ్రీ పుప్పాల వెంకన్న రాముడు అరుణ శ్రీ తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పెన్షనర్ సంఘం మండల అధ్యక్షుడు రావుల సత్యనారాయణ స్వామి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**అక్షరశక్తి, వరంగల్ :** సెప్టెంబర్ 10 న చేపట్టనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నిర్వహించిన రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ(ఆర్ఈఏటీ) సన్నాహక సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం పీఆర్‌టీయూ భవన్ హన్మకొండలో చేపట్టారు. ఆర్ఈఏటీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీదర్ల ధర్మేంద్ర, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, ఎండీ అబ్దుల్ గఫార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల ఐక్యతే మన బలం... మన హక్కుల సాధనే మన లక్ష్యం... చలో హైదరాబాద్‌ను విజయవంతం చేద్దాం! అని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్ఈఏటీ ఛలో హైదరాబాద్ ప్లే కార్డ్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈఏటీ కోశాధికారి సూర కుమార స్వామి, మేకిరి దామోదర్, ఇంద్ర సేనా రెడ్డి, విశ్వనాధం, క్షీర సాగర శ్యాం, బత్తిని సారయ్య, ములుగు గణపతి, మంగు శ్రీనివాస్, పెద్ది అంజనేయులు, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల నిరసన



**అక్షరశక్తి, హన్మకొండ** : అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. టీపీసీసీ ఎస్సీ రాష్ట్ర కమిటీ చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ నాయకత్వంలో వెయ్యి డప్పులతో బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ గారి ఎర్రవెల్లి ఫామ్ హౌస్ ముట్టడి చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడికొండ శ్రీను, చేపూరి చిరంజీవి, దబ్బేటా రమేష్, గోవిందు శ్వేతా, పరశురామ్, పుల్యాల గాంధీ తదితరులు పాల్గొన్నారు.





## రీ సర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ

**అక్షరశక్తి,వరంగల్:** జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనులను వరంగల్ ఆర్డీఓ సోమవారం పరిశీలించారు. గీసుగొండ మండలం ఎల్కుర్తిహవేలి గ్రామంలో తహసీల్దార్‌తో కలిసి రీ సర్వే పనులను పరిశీలించి, సర్వే ప్రక్రియ పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం సంగెం మండలం ముమ్మిడివరం గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను సందర్శించి పరిశీలించారు. రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వే లో సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## 13న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు

**అక్షరశక్తి,జనగామ:** జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలురు, బాలికలు, సబ్‌జూనియర్ బాలికల జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 13న ఉదయం 9 గంటలకు జనగామలోని మైనార్టీ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, పదో తరగతి మెమో జిరాక్స్ కాపులతో హాజరుకావాలని సూచించారు. జూనియర్ బాలురకు 75 కిలోలు, బాలికలకు 65 కిలోలు, సబ్‌జూనియర్ బాలికలకు 55 కిలోల లోపు బరువు ఉండాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వేములవాడలో జరిగే అంతర్‌జిల్లా, అశ్వారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జనగామ జిల్లా తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## తాత మధును ఎమ్మెల్సీ పదవి నుండి బర్తరఫ్ చేయాలి

**అక్షరశక్తి, హనుమకొండ:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వాక్యాలు చేసి అవమాన పరిచిన ఎంఎల్సీ తాత మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని, ఎంఎల్సీ పదవి కొనసాగించకుండ వెంటనే బర్తరఫ్ చేయాలని, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వంను తక్షణమే రద్దు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ దళితులంటే అగ్రవర్ణ, అహంకార, ఆధిపత్య కులాలకు చులకన భావంగా కనిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాత మధును తన ఎంఎల్సీ నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని,శాసన మండలి నుండి తొలగించి, శాసన మండలి చైర్మన్ ను కోరారు.చట్ట ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీస్ యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షులు చుంచు నరేష్, మేకల అనిత, జిల్లా నాయకులు సిహెచ్ రాజు, మనోహర్, వేణు తదితరులు పాల్గొన్నారు.




# మెరుగైన వైద్య సేవలను అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**అక్షరశక్తి,హసన్ పర్తి:** ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వ్యాక్సిన్ గది, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ గది, సిబ్బంది గది, నర్సుల గది, ఇంజక్షన్ రూమ్, ల్యాబొరేటరీ, ఫార్మసీ, టాయిలెట్స్, తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను కలిసి వారు ఏ సమస్యతో వైద్య సేవల కోసం వచ్చారో కలెక్టర్ ఆరా తీశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది స్పందన,తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలతో పాటు నిర్వహణ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు.
ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండేలా షిఫ్ట్ ల వారీగా విధులు కేటాయించాలని, ప్రతి షిఫ్ట్‌లో అవసరమైన సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండేలా పర్యవేక్షించాలని వైద్యాధికారిని ఆదేశించారు.
హాస్పిటల్ నిర్వహణ పక్కాగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- హనుమకొండలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**అక్షరశక్తి, హన్మకొండ :** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టీజీ టెట్ -2026 ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష పకడ్బందీగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న టీజీ టెట్ -2026 ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లు, అభ్యర్థుల హాజరు, కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహణ, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న పరీక్షలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద కేంద్ర స్థాయి పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. కాగా హనుమకొండ జిల్లా వ్యాప్తంగా రెండు షిఫ్టులలో కలిపి మొత్తం 2137 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, వారిలో 1961 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాశారు. 176 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం పర్యవేక్షణలో అన్ని కేంద్రాలలో ఈరోజు పరీక్ష ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంతరాలు లేకుండా సజావుగా కొనసాగినట్లు అలాగే బుధవారం కుడా ఈ పరీక్ష నిర్వహణ ఉంటుందని విద్యా శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట డీఈవో ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం డాక్టర్ బి. మన్మోహన్, బి. మహేష్, తదితరులు ఉన్నారు.

# కురవి జెడ్పీ హైస్కూల్ లో ఆర్ వో ప్లాంట్ ప్రారంభం

- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన కల్వకుంట్ల కవిత తనయుడు ఆదిత్య





**అక్షరశక్తి,కురవి :** మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన ఆర్ వో ప్లాంట్ ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తనయుడు ఆదిత్య ప్రారంభించారు. మంగళవారం కురవి జెడ్పీహెచ్‌ఎస్ ను సందర్శించి టీచర్లు, విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో ఎలాంటి సదుపాయాలు ఉన్నాయి.. ఏయే సమస్యలు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన సాంస్కృతిక ఉద్యమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మను విశ్వవ్యాప్తం చేయడంలో కల్వకుంట్ల కవిత పాత్ర గురించి టీచర్లతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

# కడియంకు సిగ్గుండాలె!



- కేసీఆర్ వల్లే గల్లీ నుంచి ఢిల్లీకి పోయినవ్!
- దళితులపై కేసీఆర్‌కు ప్రేమ లేదనడం సిగ్గుచేటు
- నిజంగా నువ్వు దళిత పక్షపాతివైతే స్పీకర్ పోడియం ముందు కూర్చో
- కేసీఆర్ అండతోనే డిప్యూటీ సీఎం.. ఇప్పుడు ఆయనపైనే విమర్శలా?
- దళిత బంధు ఇచ్చింది బీఆర్ఎస్.. కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?
- కడియం శ్రీహరిపై దాస్యం వినయ్‌భాస్కర్ ఫైర్



**అక్షరశక్తి, హన్మకొండ :** దళితులకు కేసీఆర్ ఏమీ చేయలేదంటూ అసెంబ్లీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయంగా కడియం శ్రీహరి ఎదుగుదలకు కేసీఆర్ చేసిన సహకారాన్ని మరిచిపోయి ఇప్పుడు ఆయనపైనే విమర్శలు చేయడం కృతజ్ఞతా రాహిత్యమని ధ్వజమెత్తారు. రాజకీయంగా పక్కకు వెళ్లిపోయి మూలన కూర్చున్న కడియం శ్రీహరిని గల్లీ నుంచి ఢిల్లీకి తీసుకెళ్లింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. దళిత నాయకుడైన కడియంను ఉప ముఖ్యమంత్రిని చేసి రాజకీయంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది కూడా కేసీఆర్ కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కేసులు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ మంగళవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వినయ్‌భాస్కర్ వినతిపత్రం సమర్పించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా రాస్తారోకో నిర్వహించి, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు.

**గల్లీలో ఉన్న మిమ్మల్ని ఢిల్లీకి తీసుకెళ్లింది ఎవరు?**

ఎన్టీఆర్ రాజకీయంగా అవకాశం కల్పించిన తర్వాత పక్కకు వెళ్లిపోయిన కడియం శ్రీహరికి తిరిగి రాజకీయ గుర్తింపు తెచ్చింది కేసీఆర్ కాదా? అని వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. గల్లీలో ఉన్న వ్యక్తిని ఢిల్లీకి తీసుకెళ్లి, పార్టీలో కీలక స్థానం కల్పించి, ఉప ముఖ్యమంత్రి పదవి వరకు తీసుకెళ్లింది కేసీఆర్ కాదా? అని నిలదీశారు. అలాంటి నాయకుడిపైనే ఇప్పుడు దళితులపై ప్రేమ లేదని మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ పదవుల కోసం ఒకప్పుడు అండగా నిలిచిన కేసీఆర్‌ను విమర్శించడం తగదన్నారు. కడియం శ్రీహరి గతంలో రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యల రికార్డులు ఉన్నాయని, వాటిని త్వరలో తమ మీడియా ద్వారా ప్రజల ముందుకు తీసుకొస్తామని చెప్పారు. నాడు రేవంత్‌రెడ్డి గురించి కడియం ఏం మాట్లాడారో ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు.

**నిజంగా దళిత పక్షపాతివైతే పోడియం ముందు కూర్చో**

కడియం శ్రీహరికి దళితులపై నిజంగా ప్రేమ ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలపై అసెంబ్లీలో మాట్లాడాలని వినయ్‌భాస్కర్ సవాల్ చేశారు. ఇతర నాయకులపై విమర్శలు చేయడం కాకుండా దళిత సమస్యలపై పోరాడాలని సూచించారు. నిజంగా దళిత పక్షపాతి అయితే స్పీకర్ పోడియం ముందు కూర్చొని దళితుల తరపున నిరసన వ్యక్తం చేయాలని అన్నారు. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగబద్ధమైన పదవులకు, సభా సంప్రదాయాలకు ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాలని వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు.

**దళితుల కోసం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు**

దళితులపై కేసీఆర్‌కు ప్రేమ లేదనడం వాస్తవాలను వక్రీకరించడమేనని వినయ్‌భాస్కర్ అన్నారు. దళితులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే దళిత బంధు వంటి కార్యక్రమాలను కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దళితులు, బీసీలు సహా సబ్బండ వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించిన దళిత బంధు తరహా రూ.12 లక్షల ఆర్థిక సాయం ఏమైందో కడియం శ్రీహరి అసెంబ్లీలో ప్రశ్నించాలని, కానీ అందుకు బదులుగా దళితుల కోసం పనిచేసిన కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

**వెయ్యి రోజుల్లో 420 హామీలకు దిక్కేది?**

కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు వెయ్యి రోజులు దాటినా పూర్తిస్థాయిలో అమలు కాలేదని వినయ్‌భాస్కర్ విమర్శించారు. ఆ హామీల అమలును ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరుబాట పట్టిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగాలు, కార్మికులకు ఉపాధి అవకాశాలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రెట్లు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు.

**ప్రజా నిరసనలను అణచివేస్తున్నారు**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సబ్బండ వర్గాలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే రేవంత్ సర్కార్ అక్రమ నిర్బంధాలు, అరెస్టులకు పాల్పడుతోందని వినయ్‌భాస్కర్ ఆరోపించారు. అసెంబ్లీ ఆవరణలో మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలైన సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సెప్టెంబర్ 2 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు రేవంత్‌రెడ్డి పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు.

## తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి

**అక్షరశక్తి,కాజీపేట:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ కాజీపేట కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ యువ నాయకుడు రహమతుల్లా మహమ్మద్ ఆధ్వర్యంలో కాజీపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. మౌనికా రెడ్డికి ఫిర్యాదు అందజేశారు. వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో అరూరి సాంబయ్య, విజయశ్రీ రజాలి, పసునూరి మనోహర్, పాలడుగుల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన




**అక్షరశక్తి,హనుమకొండ:** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఐడీఎఫ్‌సీ బ్యాంక్ సౌజన్యంతో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులకు వెల్లడించవద్దని తెలిపారు. బ్యాంకు అధికారులు నాగులు మారవెల్లి, సంతోష్, విజయ్ గోపాల్ సైబర్ మోసాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ చందర్, అంజన్‌రావు, అధ్యాపకులు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# AI యుగంలో మన పిల్లలు అసలు ఏం చదవాలి?


- సంధ్య అడువ
రచయిత్రి

**మార్కులు తెచ్చే చదువా... జీవితాన్ని అర్థం చేసుకునే చదువా?**
**మా అబ్బాయి ఏం చదివితే భవిష్యత్తులో మంచి ఉద్యోగం వస్తుంది?**
**మా అమ్మాయి ఏ కోర్సునీ తీసుకుంటే మంచి జీతం వస్తుంది?**

ఈ ప్రశ్నలు ఈ మధ్య ప్రతి ఇంట్లోనూ వినిపిస్తున్నాయి. పిల్లల భవిష్యత్తు గురించి తల్లిదండ్రులు ఆలోచించడం కొత్తేమీ కాదు. కానీ ఇప్పుడు ఆ ఆలోచనకు మరో పెద్ద ప్రశ్న వచ్చి చేరింది.

**AI ఇంత వేగంగా మారుతున్న సమయంలో మన పిల్లలు అసలు ఏం నేర్చుకోవాలి అని?**

పదేళ్ల క్రితం లేని ఎన్నో ఉద్యోగాలు ఇప్పుడు ఉన్నాయి. మరికొన్ని సంవత్సరాల తర్వాత ఇప్పటివరకు మనం ఊహించని ఉద్యోగాలు ఎన్నో రావచ్చు. అదే సమయంలో కొన్ని పనులను యంత్రాలు, సాఫ్ట్‌వేర్‌లు చేయడం మొదలుపెడుతున్నాయి.

ఇలాంటి సమయంలో మన పిల్లలను కేవలం ఒక ఉద్యోగం కోసం తయారు చేయడం సరిపోతుందా?

వారిని మారుతున్న ప్రపంచానికి తగినట్టు తమను తాము మార్చుకోగలిగే మనుషులుగా తీర్చిదిద్దాల్సిన సమయం ఇది.

**పుస్తకంలో ఉన్నదంతా చదివిస్తే సరిపోతుందా?**

మన చిన్నప్పుడు చదువు అంటే పుస్తకం. పుస్తకంలో ఉన్న పాఠం చదవడం, గుర్తుపెట్టుకోవడం, పరీక్షలో రాయడం... మంచి మార్కులు వస్తే మంచిగా చదివే విద్యార్థి అనే వాళ్ళు. ఇప్పటికీ పరీక్షలకు ఇవి అవసరమే. కానీ ప్రపంచం మారుతోంది.

ఒకప్పుడు ఒక సమాచారాన్ని తెలుసుకోవడానికి పుస్తకాలు వెతకాల్సి వచ్చేది. ఇప్పుడు ఒక ప్రశ్న అడిగితే AI కొన్ని క్షణాల్లో సమాధానం ఇస్తోంది.

అయితే ఇక్కడే అసలు సమస్య మొదలవుతుంది.

సమాధానం తెలుసుకోవడం కంటే, ఆ సమాధానం సరైనదో కాదో తెలుసుకోవడం ముఖ్యం.

AI తప్పు చేయదని అనుకోవడం మన పొరపాటు. అది ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించడం, పోల్చి చూడడం, సందేహించడం పిల్లలు నేర్చుకోవాలి.

అందుకే రేపటి పిల్లలకు జ్ఞాపకశక్తి కంటే ఆలోచనాశక్తి మరింత అవసరం. పిల్లలకు మొదట నేర్పాల్సింది ప్రశ్నించడం

**ఇలా ఎందుకు జరుగుతుంది?**
**దీనికి ఇంకో మార్గం లేదా?**
**ఇది నిజమేనా?**

ఇలాంటి ప్రశ్నలు అడిగే పిల్లలను మనం కొన్నిసార్లు చాలా ప్రశ్నలు అడుగుతున్నాడు అంటూ వాళ్ళని ఆపేస్తాం. కానీ రేపటి ప్రపంచానికి అలాంటి పిల్లలే అవసరం.

AI నీ ప్రశ్న అడగడం మాత్రమే కాదు... సరైన ప్రశ్నను గుర్తించడం కూడా ఒక నైపుణ్యమే. ఒక సమస్యను చూసి వెంటనే సమాధానం కోసం పరుగెత్తకుండా, ముందుగా సమస్యను అర్థం చేసుకునే అలవాటు పిల్లలకు రావాలి.

పిల్లలకి AI నేర్పించాలి... కానీ AI మీద ఆధారపడటం నేర్పకూడదు

పిల్లలకు AIని దూరంగా ఉంచడం కూడా సరైన పరిష్కారం కాదు.




అలాగే ప్రతి చిన్న పనికీ AIని ఆశ్రయించడం కూడా మంచిది కాదు.

ఉదాహరణకు ఒక పిల్లవాడు ఏదైనా ప్రాజెక్ట్ ని AI తో చేయాలనుకున్నప్పుడు మొత్తం పనిని AIతో చేయడం కంటే, ముందుగా తన ఊహతో ప్రాజెక్ట్ నమూనా సిద్ధం చేసుకోవాలి. ఆ తర్వాత AIని ఉపయోగించి మెరుగుపరచుకోవచ్చు.

అంటే AI మనిషి స్థానంలో ఉండకూడదు. మనిషికి సహాయకుడిగా మాత్రమే ఉండాలి. ఈ తేడాను పిల్లలు చిన్నప్పటి నుంచే అర్థం చేసుకోవాలి.

మనకి గణితం ఎందుకు? AI అన్నీ లెక్కలు చేస్తుందిగా ఇలాంటి ప్రశ్న కూడా భవిష్యత్తులో రావచ్చు.

కానీ గణితం అంటే కేవలం కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు కాదు. గణితం పిల్లలకు క్రమంగా ఆలోచించడం నేర్పుతుంది.

ఒక సమస్యను విడగొట్టి చూడటం, కారణం ఫలితాన్ని అర్థం చేసుకోవడం, ఒక నిర్ణయానికి రావడం ఇవన్నీ గణిత ఆలోచనలో భాగమే.

కాబట్టి AI లెక్కలు చేసినా మన ఆలోచనకు గణితం అవసరం  భాషను మరచిపోతే ఆలోచనకు కూడా నష్టం ఇప్పుడు చాలా మంది పిల్లలు గంటల తరబడి మొబైల్ చూస్తున్నారు. కానీ కొన్ని నిమిషాలు పుస్తకం చదవడానికి మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఇది మనకి చిన్న విషయంగా అనిపించచ్చు. కానీ చదవడం తగ్గితే పదజాలం తగ్గుతుంది. పదజాలం తగ్గితే ఆలోచనను స్పష్టంగా వ్యక్తం చేయడం కష్టమవుతుంది. అది తెలుగు కావచ్చు, ఆంగ్లం కావచ్చు.

పిల్లలు మంచి మంచి పుస్తకాలు చదవాలి. కథలనీ చదవాలి. వార్తలు చదవాలి. తమ అభిప్రాయాలను రాయాలి.

AI ఏదైనా వాక్యం రాయగలదు. కానీ  విద్యార్థి మనసులోని భావాన్ని అతని తరపున పూర్తిగా చెప్పలేదు.

అందుకే మనిషి మాటలకు ఆలోచనలకి విలువ ఎప్పటికీ తగ్గదు.

పాఠ్యపుస్తకంతో పాటు జీవితాన్ని కూడా చదివించాలి. పిల్లలకు మనం ఎన్నో విషయాలు నేర్పిస్తున్నాం.

**కానీ ఇంట్లో చిన్న పని చేయడం నేర్పిస్తున్నామా? తన వస్తువులను తానే సర్దుకోవడం? డబ్బు విలువ తెలుసుకోవడం? ఇంట్లో పెద్దలకు సహాయం చేయడం? ఎవరైనా బాధలో ఉన్నప్పుడు పలకరించడం?**

ఎందుకంటే ఇవి కూడా విద్యలో భాగమే.

**రేపు మన పిల్లలు ఎంత పెద్ద ఉద్యోగం చేసినా,ఎదుటి వారితో ఎలా మాట్లాడాలో తెలియకపోతే ఆ చదువుకు అర్థం ఏముంటుంది?**

పాఠశాల మార్కుల కంటే సమస్య పరిష్కారం ముఖ్యం

**విద్యార్థి 95 మార్కులు తెచ్చుకున్నాడా? మంచిదే.**

కానీ ఒక సమస్య వచ్చినప్పుడు ఏం చేయాలో ఆలోచించగలడా?

ఒక పని విఫలమైనప్పుడు మళ్లీ ప్రయత్నించగలడా?

తనకు తెలియని విషయం ఎదురైనప్పుడు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటాడా?

ఇవే భవిష్యత్తులో అతని ప్రయాణాన్ని నిర్ణయించే విషయాలు.

అందుకే తల్లిదండ్రులు పిల్లల మార్కులను అడిగినంతగా...

ఈరోజు నువ్వు కొత్తగా ఏం నేర్చుకున్నావు? అని కూడా అడగాలి.

సృజనాత్మకతను కాపాడాలి

AI బొమ్మలు వేస్తుంది. వీడియోలు తయారు చేస్తుంది.

అందుకే పిల్లలు మరింత సృజనాత్మకంగా ఉండాల్సిన అవసరం ఉంది.  ఎందుకంటే పిల్లలు అందరూ AI నీ ఉపయోగించి తమ పనులని సులభంగా చేసినపుడు అందులో ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటి? పిల్లల్లో కొత్తగా ఆలోచించే శక్తే కదా

పిల్లలను గీయనివ్వాలి. రాయనివ్వాలి. పాడనివ్వాలి. ప్రశ్నించనివ్వాలి. ప్రయోగాలను చేయనివ్వాలి.

వారు చేసే ప్రతి పని పర్ఫెక్ట్గా ఉండాల్సిన అవసరం లేదు.

కొన్నిసార్లు తప్పుగా గీసిన ఆ బొమ్మలోనూ ఒక గొప్ప ఊహ దాగి ఉండవచ్చు.

పిల్లలు విఫలం కావడానికి కూడా అవకాశం ఇవ్వాలి

తల్లిదండ్రుల ప్రేమతో కొన్నిసార్లు  సమస్యలు రావచ్చు తమ పిల్లలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే తల్లిదండ్రులే పరిష్కరించేస్తారు. హోంవర్క్‌లో ఇబ్బంది వస్తే సమాధానం చెప్పేస్తారు. వాళ్ళకి సంబంధించిన చిన్న చిన్న నిర్ణయలు కూడా తల్లిదండ్రులే తీసుకుంటారు.

**ఇలా పిల్లలను అన్ని సమస్యల నుంచి కాపాడుతూ పెంచితే, జీవితంలో ఎదురయ్యే పెద్ద సమస్యలను వారు ఎలా ఎదుర్కొంటారు?**

తప్పులు చేయడం కూడా ఒక రకంగా మంచిదే పిల్లలు తప్పు చేసినప్పుడు వెంటనే మందలించడం కంటే ఎక్కడ తప్పు జరిగింది? ఇక ముందు ఇలా జరిగితే ఏం చేస్తావు? అని అడిగితే వాళ్ళల్లో ఆలోచన శక్తి పెరుగుతుంది.

మనుషులను అర్థం చేసుకోవడం కూడా ఒక నైపుణ్యమే AI దగ్గర అపారమైన సమాచారం ఉండవచ్చు. కానీ మనుషుల బాధను పూర్తిగా అర్థం చేసుకోలేదు.

స్నేహితుడి కన్నీళ్లను చూసి అతని బాధను అర్థం చేసుకోవడం.

ఒక వృద్ధుడికి సహాయం చేయడం.

ఒక బృందంలో అందరినీ కలుపుకొని పనిచేయడం. ఇవి కంప్యూటర్‌లో నేర్పే పాఠాలు కావు. ఇవి జీవితంలో నేర్చుకునే పాఠాలు.

అందుకే పిల్లలకు సానుభూతి, సహనం, బాధ్యత, సహకారం, నాయకత్వం వంటి లక్షణాలను కూడా నేర్పించాలి.

రేపటి మన పిల్లలకు ఒకే కెరీర్ సరిపోకపోవచ్చు. ఎందుకంటే మన తరం ఒక ఉద్యోగంలో చేరి ఎన్నో సంవత్సరాలు అదే రంగంలో పనిచేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

కానీ రాబోయే కాలంలో పరిస్థితి భిన్నంగా ఉండవచ్చు. కొత్త సాంకేతికతలు వస్తాయి. పనులు మారతాయి. కొత్త అవకాశాలు పుడతాయి.

అందుకే పిల్లలను నువ్వు డాక్టర్ అవ్వాలి లేదా ఇంజనీర్ అవ్వాలి అని ఒకే దారిలో నడిపించడం కంటే

నీకున్న ఆసక్తి ఏమిటి? దాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి అని అడగడం మంచిది. వాళ్ళకి కెరీర్‌ను ఇవ్వడం కంటే కెరీర్‌ను ఎంచుకునే సామర్థ్యాన్ని ఇవ్వాలి.

**మరి పిల్లలు ఏం చదవాలి?**

దీనికి ఒకే సమాధానం లేదు.

అయితే భవిష్యత్తు కోసం పిల్లల చదువులో ఈ అంశాలు తప్పనిసరిగా ఉండేలా చుసుకోవాలి

తమ విద్యా విషయాల్లో బలమైన పునాది.

టెక్నాలజీ అవగాహన  AI డిజిటల్ సాధనాలను అవసరం మేరకే ఉపయోగించడం.

భాషనీ  స్పష్టంగా మాట్లాడటం, రాయడం, చదవడం.

సృజనాత్మకత – కొత్త ఆలోచనలు చేయడం.

విమర్శనాత్మక ఆలోచన – వచ్చిన సమాచారాన్ని ప్రశ్నించడం, పరిశీలించడం.

మానవ సంబంధాలు – ఇతరులను అర్థం చేసుకోవడం, కలిసి పనిచేయడం.

నైతిక విలువలు మంచి చెడు మధ్య తేడాను గుర్తించడం.

ఆర్థిక అవగాహన – డబ్బు విలువ, పొదుపు, ఖర్చు గురించి తెలుసుకోవడం.

నాకు అన్నీ తెలుసు అనే భావనకు బదులు నేను ఇంకా నేర్చుకోవాలి అనే ఆలోచన.

చివరగా పిల్లలను ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా జీవితానికి సిద్ధం చేయాలి

AI వల్ల ఉద్యోగాలు పోతాయో లేదో మనకు పూర్తిగా తెలియదు. రేపటి రోజుల్లో ఏలాంటి కొత్త ఉద్యోగాలు వస్తాయో కూడా మనకు తెలియదు.

కానీ ఒక విషయం మాత్రం మనం అర్థం చేసుకోవాలి

మార్పుకు భయపడని పిల్లలు ముందుకు వెళ్తారు.

కొత్తది నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్న పిల్లలు నిలబడతారు.

ప్రశ్నించే పిల్లలు ఎదుగుతారు.

సృష్టించే పిల్లలు ప్రత్యేకంగా నిలుస్తారు.

మంచి మనుషులుగా ఉండే పిల్లలకు ఎప్పటికీ విలువ ఉంటుంది.

కాబట్టి AI యుగంలో పిల్లలకు మనం ఇచ్చే గొప్ప బహుమతి ఆలోచించే మెదడు, ప్రశ్నించే ధైర్యం, నేర్చుకునే ఆసక్తి, సృష్టించే ఊహ, మనిషిని మనిషిగా చూసే హృదయం.

ఎందుకంటే, AI ఎంత తెలివైనదైనా, భవిష్యత్తును నిర్మించేది చివరికి మనిషే.

అందుకే మన పిల్లలకు మనం నేర్పాల్సిన మొదటి పాఠం

AIని ఉపయోగించడం నేర్చుకో కానీ నీ మెదడును పూర్తిగా AIకి అప్పగించకు అని.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.